

కుటుంబ భారం, ఆర్థిక అవసరాలు ఒంటరి మహిళలను కుంగదీస్తుంటాయి. కాంగ్రెస్ హయాంలో వితంతువులను, ఒంటరి మహిళలను పట్టించుకుంది లేదు. రూ.200 పింఛన్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు హస్తం నేతలు. వితంతువులకు ఆర్థిక భరోసాను కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం వితంతు పెన్షన్‌ను రూ.2,016కు పెంచింది. రాష్ట్ర వ్యాప్తంగా 15,73,050 మంది ఈ పథకం ద్వారా ఆసరా పొందుతున్నారు. వితంతువులకు అధిక పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణే. 2014 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.34వేల కోట్లు పింఛన్ల రూపంలో అందించింది.

## ముందుకు పోదామా! ఎన్కకా!!

### ఆసరా.. మా ఇంటికో ధైర్నం

కట్టం తెలిసినోల్లే.. దాన్ని తీర్సే ఉపాయం చేస్తరని పెద్దలంటరు. నా బతుకు తెలంగాణ అచ్చినంకనే ఓ గడ్డన వడ్డది. మా ఆయన వడ్రంగి పని చేసేటోడు. ఎన్ని తిప్పలున్నా.. మేం మంచిగనే ఉండేటోళ్లం. సక్కగ సాగుతున్న సంసారం ఒక్కపూటలో ఆగమైంది. పదేండ్ల కిందట మా ఆయన నరాల జబ్బుతోని సచ్చిపోయిండు. అప్పటికి నాకు 26 ఏండ్లు. ఇద్దరు పిల్లలు. భూమి లేదు. బతికే తోవ లేదు. సదువుందా అంటే.. ఎనిమిదో తరగతితోనే ఆగిపోయింది. కైకిలి చేసుకుంట పిల్లల్ని సదివించుకున్న. ఆయన సచ్చిపోయిన కొన్నాళ్లకు వితంతు పింఛన్ వచ్చింది. ఆ రెండు వందల పింఛన్ వచ్చినా రానట్టే ఉండేది. పాతకాలం ఇల్లు కూలిపోయింది. కట్టించుకునే పైసల్లేక కిరాయింట్లకు మారిన. తెలంగాణ అచ్చినంక పింఛన్ వెయ్యి రూపాయలు అయింది. అదే మా ఇంటికి ఆసరా అయింది. తర్వాత రెండు వేలు చేసుడుతోని ఒక్కో గండం నుంచి గట్టెక్కిన. కైకిలి పైసలతోని ఇల్లు గడుస్తుంది. పింఛన్ పైసలతోని పిల్లల సదువు ఎల్తున్నది. నేను మళ్లీ సదువు షురూ చేసిన. కైకిలికి పోతనే సదువుకుంటున్న. పింఛన్ పైసల్తోని ఫీజు కట్టి పది, ఇంటర్ పాసైన. డిగ్రీల చేరిన. ఒక సెమిస్టర్ పరీక్షలు రాసిన. పిల్లలు కాలేజీ సదువుకొచ్చినరు. కర్సులు పెరుగుడుతోని నా సదువు ఆపేసిన. ఇంట్ల అవసరాల కోసం వంద రూపాయలు అప్పు జేస్తే, ఆసరా పింఛన్ రాంగనే తీరుస్తున్న. కేసీఆర్ సార్ ఇస్తున్న ఆసరా నాకు, నా కుటుంబానికి ధైర్నమైంది.

• వడ్ల అనిత, అంబాజీపేట గ్రామం, చిన్న శంకరంపేట మండలం, మెదక్ జిల్లా





తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | శనివారం 18 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ
www.ntnews.com



### నేతన్నకు దన్ను

చేనేత కార్మికుల కుటుంబాలను మరింతగా ఆదుకోవడానికి రాష్ట్రంలో రైతన్నలకు అమలు చేస్తున్న రైతుబీమా తరహాలో చేనేత బీమా అమలు చేస్తున్నం. దురదృష్టవశాత్తు ఏ నేత కార్మికుడైనా మరణిస్తే ఈ పథకం కింద అతని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాలో రూ.5లక్షలు బీమా సొమ్ము జమ అవుతుంది. నేతన్నలకు పెట్టుబడి తగ్గించాలనే ఉద్దేశంతో నూలు, రంగులు, రసాయనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం. ■ కేసీఆర్

# బీజేపీలో జాతీయవాదం లోపించింది

ఫటాఫట్ Interview

**చాలాకాలం నుంచి బీజేపీలో ఉన్న పల్లపు గోవర్ధన్ ఆ పార్టీని ఎందుకు వీడాల్సి వచ్చింది?**

నేను ఆరెస్సెస్, భాగ్యనగర్ ఉత్సవ సమితి, హిందూ సంఘాలు, బీజేపీలో ఇలా మొత్తంగా సుమారు 22 ఏండ్లు సేవలు అందించాను. వందల సభలు, సమావేశాలు నిర్వహించాను. మొన్నటికి మొన్న మునుగోడు ఉప ఎన్నికలో కూడా పనిచేశాను. వడ్డెర సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నాను. అయినా ఖైరతాబాద్‌లో మాలాంటి వాళ్లకు తగిన గుర్తింపు, గౌరవం లేదు. కొన్ని సామాజిక వర్గాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకే పార్టీని విడిచిపెట్టాల్సి వచ్చింది.

**ఖైరతాబాద్ టిక్కెట్ ఇవ్వలేదనే కారణం వల్లే పార్టీ వీడారన్న విమర్శలకు మీ సమాధానం.**



పల్లపు గోవర్ధన్

ఖైరతాబాద్‌లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోరాడాను. చింతల రామచంద్రారెడ్డికి రెండు మూడు దశాబ్దాలుగా అవకాశాలు ఇస్తూనే ఉన్నారు. పార్టీలో యువతకు ఎక్కడా అవకాశం ఇవ్వడం లేదు. ఈసారైనా యువతకు ఇవ్వాలని, ముఖ్యంగా బీసీలకు పెద్దపీట వేయాలని కోరాను. రాష్ట్రంలో 28 లక్షల మంది వడ్డెరలు ఉన్నారు. ఖైరతాబాద్‌లో మా ఓటర్లు వేలాది మంది ఉన్నారు. వారి ప్రతినిధిగా టికెట్ ఆశించడం తప్పేం కాదు. కానీ రాష్ట్ర నాయకత్వం మా వినతి పట్టించుకోలేదు.

**బీసీలకు పెద్దపీట వేస్తున్నామని బీజేపీ చెబుతున్నది. బీసీల ఆత్మగౌరవ సభకు ప్రధాని మోదీ కూడా వచ్చారు కదా?.**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో సుమారు 150-180 బస్తీలు ఉన్నాయి. అన్ని కులాల వారు ఉండే మినీ ఇండియా ఈ ప్రాంతం. బీజేపీ నిజంగా బీసీలకు పెద్దపీట వేసే పార్టీ అయితే ఖైరతాబాద్ టికెట్‌ను బీసీలకే ఇవ్వాలి. బీజేపీ అంటేనే జాతీయ వాదం, క్రమశిక్షణ అనే భావన ఉండేది. కానీ, ఇప్పుడు ఆ పార్టీలో జాతీయ భావం లోపించింది. మూల సూత్రాలను పక్కనబెట్టి, కులాల కుంపట్లు, వ్యక్తిగత ద్వేషాలతో వీధుల్లో పోరాటాలు చేసుకునే స్థాయికి దిగజారింది.

**బీఆర్ఎస్‌నే ఎందుకు ఎంచుకున్నారు?**

నేను బీజేపీలో ఉన్నా తెలంగాణ ఉద్యమకారుడినే. మిలియన్ మార్చ్ సహా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. రాదు అన్న రాష్ట్రాన్ని.. సాధించిన వ్యక్తి సీఎం కేసీఆర్. ఆయన పోరాటాన్ని కండ్లారా చూశాను. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధికి ఆయన పడిన తపనను కూడా దగ్గరుండి చూశాను. ఉద్యమంలోనే ఉద్దండుడు అనుకుంటే.. అభివృద్ధిలో మహా ఉద్దండుడిగా ఆయన కనిపించారు. కేసీఆర్ పాలించే విధానం నచ్చి, రాముడికి ఉడుత సాయంగా నా వంతు సాయం చేసేందుకు బీఆర్ఎస్‌లో చేరాను.

• మహేందర్





## అసలు ముచ్చట

ఎండిన డొక్కలతో, అరిగిన బొక్కలతో దశాబ్దాల పాటు దుర్భర జీవితాలు అనుభవించారు చేనేత కార్మికులు. అగ్గిపెట్టెలో చీరను ఇమడ్చగల కళ సొంతమైనా... నాటి పాలకుల నిర్లక్ష్యం సాలెల మగ్గం సడుగులు ఇరిగేలా చేసింది. చేసేందుకు పనిలేక, కుటుంబాన్ని పోషించలేక తాము నేసే నూలు పోగులనే ఉరితాళ్లుగా చేసుకొని బలవన్మరణం పొందిన నేతన్నలెందరో! ఆనాటి వార్తలు కాంగ్రెస్ పాలకులు చేసిన గాయాలను నేటికీ గుర్తు చేస్తాయి.

తెలంగాణ రాకతో నేతన్నల బతుకు చిత్రం మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి విధానాలు, సంక్షేమ ఫలాలు పడుగు, పేకలా మగ్గంతో జతకట్టాయి. పొట్టకూటి కోసం ఎక్కడెక్కడికో వలస పోయిన నేత కార్మికులు సొంతూళ్లకు చేరారు. ఇక్కడి ఇక్కత్ సొగసులు ఎక్కడెక్కడికో చేరాయి. నేతన్న ఆత్మ గౌరవం పెరిగింది. ఆత్మహత్యలు ఆగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు నేత కుటుంబాలకు ఆదరువై తమ మగ్గాన్ని మూడు పూటలా ఆడిస్తున్నాయని చెబుతున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి చేనేత కార్మికులు. నాటి వెతలను, నేటి బతుకులను 'అసలు ముచ్చట'లో ఇలా పంచుకున్నారు..



# కేసీఆరే మా నేత

### బీఆర్ఎస్ వెంటే మేమంటున్న పోచంపల్లి

- తెలంగాణ రాకతో చేనేతకు దన్ను
- సర్కారు అండతో మారిన బతుకులు
- పింఛన్‌తో తీరిన బాధలు
- చేనేత బీమాతో కుటుంబాలకు ధీమా

**వనం సతీశ్ కుమార్ (చేనేత కార్మికుడు):** తెలంగాణ రాక మునుపు ఏ నేతన్న ఇల్లు చూసినా.. దరిద్రమే కండ్లవడ్డుండే! అప్పటికీ.. ఇప్పటికీ పోలికెక్కడిది? కాంగ్రెసోళ్ల పాలనతో మన బతుకులు ఆగమాగం ఉంటుండె కదా! సాలోళ్ల ఇండ్లల్ల మగ్గమే జీవనాధారం. భర్త, భార్య, పిల్లలు అందరూ కట్టవడ్డా.. తిండికి ఎల్లకపోవు. ఆ బాధలు నా కండ్లల్ల ఇంకా మెదుల్తున్నయ్. తెలంగాణ అచ్చినంక నాలు గేల్లు నోట్లకు పోతున్నయ్. మన బతుకులు దారినవడ్డయ్.

**కూరపాటి సుధాకర్:** నా ముచ్చటే చూడరాదే..! ఈడ పన్లేక హైదరాబాద్ పోయిన. అపార్టుమెంట్‌ల వాచ్‌మెన్ పని చేసిన. పొద్దంత కట్టవడ్తె నెలకు నాలుగువేలు అస్తుండే. నైట్‌డ్యూటీ చేసి పానం కరాబయ్యేది. కొలువు ఆడ.. పిల్లలు ఈడ.. మనసు పీకుతుండే. కొందరు ఇంటోనర్ల మాటలకు గుండె చివుక్కుమనేది. ఇయ్యాల బాజాప్త నా ఊర్లనే ఉంటున్న. పని మస్తు దొరుకుతాంది. సావుకారు దగ్గర రంగులు అద్దుతున్న. నెలకు 20వేలు పుడ్తున్నయ్. నాలెక్క ముంబయి, భీవండీ, సూరత్ పోయినోళ్లందరు మళ్లీ ఊళ్లకొచ్చిన్రు. మగ్గాలు మంచిగాడుతున్నయ్.

**సూరెపల్లి లక్ష్మమ్మ:** సుధాకరు.. నా కథ నీకు తెల్వంది గాదు! మా ఆయన శాతనైతే అప్పుడో ఇప్పుడో మగ్గం నేస్తడు. పన్జేసిన పానం కదా ఏదో తండ్లాడ్తడు. ఒక్క పొర రెండు, మూడు నెలలు నేస్తడు. గట్ల పన్జేస్తే రోజులెల్తయా? కేసీఆర్ సారు మాకు నెలకు రూ.2,016 పింఛనిస్తుండు. అదేదో చేనేత మిత్ర పథకం అంట.. నెలకు అవో 2వేలు ఖాతాల వేస్తున్రు. అటీటు అంతా నాలుగు వేలదాకా సర్కారు ఇస్తున్నది. బియ్యం కూడా సర్కారే ఇయ్యవట్టే. ఒకరికింద చేయి సాచే బాధ లేకుండ రోజులెల్తున్నయ్.

**జెట్ల కృష్ణస్వామి:** గంతెందుకవ్వా! కరోనా టైమ్‌ల మనకు పెద్ద దెబ్బ పడ్డది. కూలీలిచ్చే సావుకారులు చేతులెత్తేసిన్రు. నేసిన చీరలన్నీ మూలన పడ్డయ్. గా టైమ్‌ల కేసీఆర్ సారే దిక్కయిండు. పొదుపు పైసలు బ్యాంకులేసిండు. నాకు లక్ష రూపాయలచ్చినయ్. పొదుపు పథకం తెల్వదానే.. నెలకు మన మింత కడితే, సర్కార్ ఇంత జమ చేస్తది! ఆ పైసలిచ్చుడుతోని కరోనా టైమ్‌ల శానమంది బయటపడ్డరు. గీ స్కీమ్ అంతకుముందెప్పుడు లేదు. కేసీఆర్ సారు తెచ్చిండు.

**వనం దివ్య:** సీన్మలల్ల మగ్గం ఆడించుడు చూసి మస్తు అని పిస్తది కని, నేసుడు పని చూసినంత వీజీ కాదు. రంగులు అద్దుడు, పడుగు సాపుడు ప్రతి పనీ కష్టమే. పెట్టుబడి తక్వైతదా!! పదేండ్ల కిందట రంగులు, రసాయనాల పైసలు మొత్తం మన మీదనే పడ్తుండే. కేసీఆర్ సారు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నడు. పెట్టుబడి తగ్గుడుతోని లాభం పెరిగింది. స్వామి.. గీమధ్య ఇంకో స్కీమ్ తెచ్చిన్రు. జియో ట్యాగింగ్ ఉన్నోళ్లందరికీ ప్రతి నెలా పైసలు ఇస్తున్రు. ఖాతాలో రూ.2వేల వరకు పడ్తున్నయి. నాక్కూడా రూ.500 వస్తున్నయ్. చేనేత మగ్గం పథకం కొత్తగ షురువైంది. ఇప్పుడున్న గుంట మగ్గాలు పక్కనబెట్టి.. ఫ్రేమ్ ఇస్తున్రు.


**గొట్టిముక్కల ఆండాలు:** అవ్ బిడ్డా.. కేసీఆర్ దేవుడు. మా కుటుంబమంతా ఆయనకు రుణపడి ఉంటది. నాకొక్కడే కొడుకు. రైలు కిందపడి ఆడి రెండు కాళ్లు పోయినయి. అయినా అట్లనో ఇట్లనో బతుకుతుంటిమి. ఎందుకో దేవుడికి మా మీద కోపం. ఆరు నెలల్లో ముగ్గురు పెద్ద దిక్కులను పోగొట్టుకున్నం. మా ఆయన పోయిన కొన్ని రోజులకే మా కోడలు అమ్మ పోయింది. కొన్నొద్దులకే మా కొడుకు గుండెపోటుతో కాలం చేసిండు. వాడికి ఇద్దరు ఆడబిడ్డలే. ఉండనీకి ఇల్లు లేదు. తిననీకి తిండి లేదు. ఈ బాధ చూడలేక.. ఎట్ల బత్కాల్నో తెల్వక.. నేను, మా కోడలు, ఆడబిడ్డలు అందరం సద్దామనుకున్నం. కానీ, నేత కార్మికుడు సచ్చిపోతే చేనేత బీమా ఇస్తరని ఊర్లోళ్లు చెప్పిన్రు. నా బిడ్డ పోయిన పది రోజులకే ఐదు లచ్చలొచ్చినయ్. ఆ పైసలతోని అప్పులు తీరినయ్. ఆడబిడ్డల పేరు మీద చెరో లచ్చ బ్యాంకులేసినం. ఇయ్యాల మేమంతా బతికున్నమంటే అందుకు కారణం కేసీఆర్ సారే!



**మంత్రి సత్యనారాయణ:** ఇన్నొద్దులూ మన గురించి ఎవరన్న ఆలోచించిన్రా అమ్మా! దేశంల ఇంకెక్కడన్న గిసొంటి స్కీమ్‌లున్నయా?! కేసీఆర్ సారు మనకోసం గింత చేస్తుంటే.. కేంద్రంలున్న బీజేపోల్లు మన మీద పగవట్టిన్రు. ఇప్పుడిప్పుడే మంచిగ బత్కుతున్నంరా నాయనా అంటే.. చేనేత మీద జీఎస్టీ ఏస్తరంట! ఎన్నడన్న.. ఎప్పుడన్న ఉన్నదా ఇట్ల? మనకు సాయం చేసుడుపోయి.. మనకాడ్నే గుంజుకునే ఉపాయం చేస్తున్రు. ఇట్లాంటోళ్లకు కర్రు కాల్చి వాత వెట్టాలే.

**వనం సతీష్ కుమార్:** గా పువ్వుపార్టీ ఊళ్లల్ల ఇప్పట్ల రాదు గని, కాంగ్రెసోళ్లను నమ్మొద్దన్నా! ఇన్నేండ్లు పాలించి.. మనల్ని ఆగజేసింది ఆళ్లే కదా! 'మీకిది చేస్తమ'ని కూడా చెప్తలే! సెప్పినా చేస్తరన్న గ్యారెంటీ లేదు. అసోంటోళ్లను నమ్మితే చేజేతులా మన బతుకులను ఆగం చేస్కున్నట్టే! పదేండ్లు ఎన్కకు పోయినట్టే!! కేసీఆర్ సార్ ఇప్పట్కే చేతల సర్కారు.. చేనేతల సర్కారు అని నిరూపించుకుండు. నేతన్న గోడు పట్టించుకున్న కేసీఆర్ సారే మన నేత.

... పున్న శ్రీకాంత్ గుజ్జ నరేశ్



### కాళేశ్వరం @ 3 ఏండ్లు

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరాన్ని తెలంగాణ సర్కారు కేవలం మూడేండ్లలోనే నిర్మించింది. పాతాళంలో పారుతున్న గోదావరిని ఒడిసిపట్టి తెలంగాణ సిగలో ప్రతిష్ఠించి.. సాగునీటి గోస తీర్చిన ప్రాజెక్టు ఇది. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయడంతో రూ.లక్ష కోట్లు ఆదా అయినట్టు మంత్రి హరీశ్‌రావు పేర్కొనడం గుర్తించదగ్గ అంశం.



### సర్దార్ సరోవర్ డ్యామ్ @ 56 ఏండ్లు

గుజరాత్‌లో సాగునీటి అవసరాల కోసం తాతలనాడు నర్మదా నదిపై సర్దార్ సరోవర్ డ్యామ్ నిర్మించ సంకల్పించారు. దశాబ్దాలు గడిచినా పనులు ముందుకుసాగలేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌కు మూడుసార్లు సీఎం గిరీ చేసినా.. పని కాలేదు. 56 ఏండ్లకు గానీ ప్రాజెక్టు పూర్తికాలేదు. తీవ్ర జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం వందల రెట్లు పెరిగింది.

### థౌజండ్ వాలా..

